గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అశ్రద్ధ

● తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య

వికారాబాద్, ఆగస్టు 31 : గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య(టీఏఎస్ఎస్) వికారాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు సానియా శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గురుకుల పాఠశాలల్లో నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉందని, విద్యార్థుల అస్వస్థత, వేధింపులు, బెదిరింపులు, భోజనం సరిగా లేకపోవడం, ఇతర వసతుల లోపాలు వెలుగుచూస్తున్నా అధికారులు, ప్రభుత్వం ఏమీ జరగనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న అశ్రద్ధను తెలుపుతున్నదని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి అన్ని గురుకులాల్లో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పాలమాకుల గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకుని, సిబ్బందిని పంపించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుతాన్ని కోరారు.

వికారాబాద్‌లోని శివారెడ్డిపెట్ బాలుర పాఠశాల, కొత్తగడిలోని బాలికల పాఠశాలలోనూ ఇలాంటి సంఘటనలు జరిగాయని, ఇవి బయటికి రానీయకుండా అక్కడి సిబ్బంది విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగిన తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గురుకులాల్లో సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ముఖ్యమంత్రి కలవనున్నట్లు తెలిపారు.

అనంతగిరి అటవీ ప్రాంతాన్ని సందర్శించిన ట్రైనీ బీట్ ఆఫీసర్లు

అనంతగిరిని సందర్శించిన ట్రైనీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

వికారాబాద్, ఆగస్టు 31 : తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు 33 మంది అనంతగిరి అటవీ ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. అటవీశాఖ పనితీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అటవీ సంరక్షణలో భాగంగా అత్యంత సునిశితత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటవీ సంరక్షణ సంక్లిష్టంగా మారిన దృష్ట్యా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అటవీ సంరక్షణ సోషల్ వర్క్ లాంటిదని అందరినీ కలుపుకుని అడవులను సంరక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రూపాయికే వైద్య సేవలు..

● శ్రీనగర్‌కాలనీలో జీఎస్ చారిటీ దవాఖాన ప్రారంభం

దవాఖాన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, రీడ్ ఆర్గనైజింగ్ సంస్థ ప్రతినిధులు, వైద్యులు

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 31: సమాజానికి తమ వంతుగా ఏదైనా చేయాలనుకున్నారు.. పిల్లలను వైద్యులుగా తీర్చిదిద్దారు.. ఇంకేముంది.. వారితోనే రూపాయికే అందరికీ వైద్య సేవలు అందించాలనుకున్నారు. ఇంటినే హాస్పిటల్‌గా మార్చేశారు.. రీడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ చిల్లంశెట్టి గణేశ్, సెక్రటరీ శమంతకమణి దంపతులు.

మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల శ్రీనగర్‌కాలనీలో రీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీఎస్ చారిటీ హాస్పిటల్‌ను వైద్యులు అజయ్‌చంద్రప్రకాశ్, అన్వేష, అనూష, కృష్ణప్రసాద్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూపాయికే వైద్య సేవలందించాలనుకోవడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజానికి ఎంతోకొంత సేవ చేయాలనే దృక్పథంతోనే రూపాయికే వైద్య సేవలు అందించాలని భావించి, హాస్పిటల్ ఏర్పాటు చేశామని గణేశ్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోతె మణెమ్మ, సీనియర్ నాయకులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, సెయింట్ జాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ రాంరెడ్డి, గ్లోబల్ మ్యాక్ బ్యాక్ ఎండీ, సెక్రటరీ జగన్మోహన్‌రెడ్డి, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్, నాయకులు భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, మధుగౌడ్, వినోద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

రూల్స్ అతిక్రమిస్తే..అంతే

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు.. తప్పదు మూల్యం

ఇప్పటివరకు 7,565 లైసెన్స్‌లు రద్దు.. గతేడాది 16, 649లు క్యాన్సిల్

నిబంధనల అతిక్రమణలపై రవాణా శాఖ కొరడా

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'కొందరు డ్రైవర్లు మృత్యుపాశాలుగా మారుతున్నారు. డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి.. ఇతరుల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. నగర రహదారులపై స్పీడ్ లిమిట్ నిబంధన ఉన్నప్పటికీ దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా దూసుకొస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై సైతం వేగంగా వెళ్లడానికి యత్నిస్తున్నారు. ఇలాంటి క్రమశిక్షణారాహిత్య డ్రైవింగ్‌తో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల హబ్సిగూడలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లోనూ అతివేగమే కారణంగా నిపుణులు చెబుతున్నారు. కారణమేదైనా నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో మరొకరి ప్రాణం తీసి వారి కుటుంబానికి శోకం మిగిల్చిడం..తీవ్ర నేరంగా అధికారులు భావిస్తున్నారు. కేసు నమోదుతో పాటు డ్రైవర్ల లైసెన్స్‌ల రద్దును పరిశీలిస్తున్నారు.

-సిటీబ్యూరో, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ)

వాహనదారుల నిర్లక్ష్యంపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, ట్రాఫిక్, రవాణా నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులు మొదటి కేటగిరీగా, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నవాటిని రెండో కేటగిరీగా వర్గీకరించి కేసులు నమోదు చేస్తున్నారు. వాహనం నంబర్‌పై స్పీడ్ లేజర్ గన్ చిత్రీకరించిన దృశ్యాలను చూస్తూ అధికసార్లు అతివేగంతో ప్రయాణించడాన్ని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి.. లైసెన్స్ సస్పెండ్ చేయాలని రవాణాశాఖకు పంపుతున్నారు. లైసెన్స్ రద్దులో ఉన్నప్పుడు వాహనం నడుపుతూ దొరికితే జైలు శిక్ష కూడా పడే వీలుంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారుల్లో క్రమశిక్షణ పెంపొందించే అవగాహన కార్యక్రమాలు సైతం ఆర్టీఏ అధికారులు నిర్వహిస్తున్నారు.

లైసెన్స్ రద్దు వివరాలు ఇలా...!

జిల్లా	2023	2024 (ప్రస్తుతం వరకు)
హైదరాబాద్	6158	2833
రంగారెడ్డి	6030	2935
మేడ్చల్	4461	1797

రిటైరైనా.. పోలీస్ కుటుంబసభ్యులే..

● వికారాబాద్ ఎస్పీ కే.నారాయణరెడ్డి



పదవీ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 31 : సుదీర్ఘ కాలం డిపార్ట్మెంట్‌కు సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు కూడా పోలీస్ కుటుంబంలో భాగమే అని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐ యాదయ్య, ఏఎస్ఐ ఎండీ యాకూబ్ అలీ పదవీ విరమణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పదన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించిన వారికి సమాజంలో ఎప్పుడూ గౌరవం ఉంటుందన్నారు.

ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరమని ఆయన పేర్కొన్నారు. పోలీస్‌శాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ డీఎస్‌పీ విజయ్‌కుమార్, ఏఓ జ్యోతిర్మని, పరిగి సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

నవాబుపేట, ఆగస్టు 31: వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి శనివారం నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల కోసం సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో మండలంలో శాంతిభద్రతలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలు తమ సమస్యలపై స్టేషన్‌కు వస్తే వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. సైబరు మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రధాన చౌరస్తాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సెప్టెంబర్ 28న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, ఆగస్టు 31 : రాజీయే రాజమార్గం అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు కోర్టు ప్రాంగణంలో సెప్టెంబర్ 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై జూనియర్ సివిల్ జడ్జి స్వరూప శనివారం పోలీసులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కక్షిదారులు లోక్ అదాలత్‌కు హాజరై సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకొని పోలీస్ కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, సీఐలు ప్రమోద్‌కుమార్, జగదీశ్, శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే.. సంతృప్తి

● వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

పదవీ విరమణ పొందిన జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 31: బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినపుడే జీవితంలో సంతృప్తి కలుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఉద్యోగ పదవీ విరమణ పొందిన డీపీఆర్ఓ కార్యాలయ పబ్లిసిటీ అసిస్టెంట్ కే. జ్ఞానేశ్వర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు అధికారుల మన్ననలు పొందడమే కాకుండా వ్యక్తిగతంగా సంతృప్తిని కలగజేస్తుందన్నారు. జ్ఞానేశ్వర్ ఫొటోగ్రఫీలో నైపుణ్యాన్ని చాటుకోవాలని కలెక్టర్ అకాక్షించారు. అంతకుముందు పదవీ విరమణ పొందిన మిషన్ భగీరథ ఈఈ బాబుశ్రీనివాస్‌ను కలెక్టర్ తన చాంబర్‌లో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. జ్ఞానేశ్వర్‌ను అధికారులు, పాత్రికేయులు, సహచరులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కళాకారుల గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, డీవైఎస్ఓ హనుమంతరావు, డీఎస్సీ డీఓ మల్లేశం,మెప్మా పీడీ రవికుమార్, మాజీ డీపీఆర్ఓ నర్సింహులు, సమాచార పౌర సంబంధాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీల్లో రూ.206.39 కోట్ల రుణమాఫీ

● మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆమనగల్లులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పక్కన డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, ఆగస్టు 31 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ బ్యాంకుల ద్వారా రూ. 206.39 కోట్ల రుణమాఫీ జరిగిందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇటీవలే డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన ఆయన మొదటిసారిగా శనివారం ఆమనగల్లు సింగిల్‌విండో కార్యాలయాన్ని, డీసీసీబీ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, బ్యాంకు మేనేజర్ గోపాల్ చైర్మన్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని, ఎవరూ ఆధైర్యపడవద్దని అర్హులైన రైతులందరికీ త్వరలోనే రుణమాఫీ అవుతుందని ఆయన పేర్కొన్నారు. డీసీసీబీ బ్యాంకు ద్వారా విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.14.49 కోట్లు, రూరల్ హౌసింగ్ రుణాలు రూ. 2,101 కోట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల సొసైటీలో 927 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా 447 మందికి మాఫీ జరిగిట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు బ్యాంకు నుంచి బంగారంపై రూ. 17 కోట్ల రుణాలు అందిచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో డీసీసీబీ బ్యాంకు మేనేజర్ గోపాల్, ఫీల్డ్ సూపర్‌వైజర్ రాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

● ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. శివకుమార్

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న టీఎన్జీవోఎస్ జిల్లా కమిటీ సభ్యులు

వికారాబాద్, ఆగస్టు 31 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్టీవోఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ టీఎన్జీవోస్ యూనియన్ భవన్‌లో శివకుమార్ అధ్యక్షతన టీజేఈ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సీపీఎస్ వియోచన దినం సందర్భంగా ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఉదయం 10:30 గంటలకు టీఎన్జీవోస్ భవన్‌లో సమావేశమై అక్కడి నుంచి సినీ మ్యాక్స్ థియేటర్ నుంచి ర్యాలీగా బయల్దేరాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి నిరసన తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, ట్రెజరర్ రమేశ్, కార్యవర్గ సభ్యుడు హాజి, ఎస్టీయూ అధ్యక్షుడు రత్నం, నాలుగో తరగతి సంఘం వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యుడు మధుకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

తుర్కయంజాల్,ఆగస్టు 31: శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి ప్రజలకు, నిర్వాహకులకు సూచించారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి కమ్మగూడలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో వివిధ శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గణేశ్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మండపాల వద్ద సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవడానికి పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు.

గణేశ్ నిమజ్జనం జరిగే చెరువులు,కుంట వద్ద విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నిమజ్జనం వివరాలను పోలీసులకు వివరించాలని ఆమె తెలిపారు. రోజూ మండపం వద్ద జరిగే విషయాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

సీసీ కెమెరాలతో ప్రయోజనం..

గణేశ్ మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదుపు చేయవచ్చునని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో సీసీ కెమెరాలు అద్దెకు లభిస్తున్నాయని వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె తుర్కయంజాల్ మాసాబ్ చెరువును పరిశీలించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనూరాధ, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు రాజు, కె.రాజు, కౌన్సిలర్లు కల్యాణ్‌నాయక్, కోశికె అయిలయ్య, కుంట ఉదయశ్రీ, మంగమ్మ, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా కార్యదర్శి రమేశ్, వివిధ పార్టీల నాయకులు, అన్ని శాఖల తదితరులు పాల్గొన్నారు.

3న వ్యవసాయ వర్సిటీ వార్షికోత్సవం

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 31: తెలంగాణ ఏర్పడిన అనతి కాలంలోనే, అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వరి ధాన్యం పెరగడంలో ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతాంగానికి అండగా నిలిచింది. పరిశోధన, విస్తరణ, విద్యా, విభాగాల్లో విప్లవాత్మక మార్పుకు నాంది పలికింది. సెప్టెంబర్ 3కు 10 వసంతాలు పూర్తి కానుంది. 2014 ఏర్పాటు నుంచి పీజేటీఎస్ఏయూ జాతీయ స్థాయిలో అనేక ఉన్నత శిఖరాలను అందుకుంది. వర్సిటీ రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి పదేండ్లలో 5 నూతన వ్యవసాయ కళాశాలలు, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, 4 వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలలను ప్రారంభించారు. అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్‌లో పీజీ కోర్సు అభ్యసించేందుకు విద్యార్థులకు ఓవర్సీస్ ఫెలోషిప్ అందించామన్నారు. విశ్వవిద్యాలయం చర్యలతో 2024లో దేశ వ్యాప్తంగా వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాల్లో పీజేటీఎస్ఏయూ 37 స్థానంలో నిలిచిందని తెలిపారు.

పబ్బులపై దాడులు

ఎక్సైజ్, టీజీ న్యాబ్ జాయింట్ ఆపరేషన్
ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు శుక్రవారం రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు పబ్బులపై దాడులు నిర్వహించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రముఖ ప్రాంతాల్లో ఏక కాలంలో 25 ప్రత్యేక బృందాలతో నిర్వహించిన సోదాల్లో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్టు తేలింది. మొత్తం 130 మంది అనుమానితులను డ్రగ్ డిటెక్షన్ కిట్‌లతో పరీక్షించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. జీరో 40 బ్రేవ్స్‌లో ఐటీ ఉద్యోగి, రియల్టర్, విస్కీసాంబా పబ్‌లో డీజే ఎంప్లాయ్, స్టూడెంట్, జరా పబ్‌లో ఓ ఉద్యోగి, క్లబ్ రోగ్ పబ్‌లో విజయవాడకు చెందిన ఓ యువతికి పాజిటివ్ రాగా కేసులు నమోదు చేసి, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు అనీల్‌కుమార్‌రెడ్డి, ఆర్ కిషన్, అదనపు ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు మనోహర్‌రావు, తిరుపతియాదవ్, టీజీ న్యాబ్ సీఐలు రాజశేఖర్, సంతోష్‌కుమార్, ఎస్సైలు వెంకట్, వెంకటరమణ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి పటిష్ట ప్రణాళిక.

● బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): నగరాభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకొని ముందుకెళ్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ అనుబంధ శాఖల అధికారులతో సిటీ అభివృద్ధే లక్ష్యంగా 66వ కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న ఎజెండా అంశాల్లో చేపట్టిన పనులు, పూర్తయినవి, ట్రాఫిక్ సమస్యలు, రోడ్ సేఫ్టీ, వాటర్ లాగింగ్ పాయింట్స్, ఇరుకు రోడ్లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు ఆయా రోడ్ల జంక్షన్లలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అదేవిధంగా ప్రస్తుత సమావేశంలో తీసుకున్న కొత్త ప్రతిపాదనలకు ప్రణాళికలు చేశారు. సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యశాఖలైన ఆర్ అండ్ బీ, మెట్రో రైలు, విద్యుత్, జాతీయ రహదారులు, ట్రాఫిక్, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగర ఇమేజ్ మరింత పెంచేందుకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే విధ